


## వ్యసనాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు: ఎస్ఐ వినయ్‌కుమార్

- **డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి**

**జహీరాబాద్ | ఆగస్టు 31 | ఆశ్వి అప్డేట్స్:**

క్షణికానందం కోసం మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని చిరాగ్‌పల్లి ఎస్ఐ కె. వినయ్‌కుమార్ కార్మికులకు సూచించారు. చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రైవేట్ కంపెనీ ఆవరణలో సోమవారం కార్మికులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగంతో శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతాయని తెలిపారు. కష్టపడి సంపాదించిన డబ్బును వ్యసనాలకు ఖర్చు చేసి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. ఒక్క వ్యక్తి వ్యసనానికి బానిసైనా కుటుంబం మొత్తం తీవ్రంగా నష్టపోతుందని పేర్కొన్నారు. యువత, కార్మికులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. కంపెనీ పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ స్పష్టం చేశారు. కార్యక్రమంలో కంపెనీ యాజమాన్య ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



## పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఘన సన్మానం

- **అంకితభావం, క్రమశిక్షణతో అందించిన సేవలు అభినందనీయం: ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్**

**నల్లగొండ | ఆగస్టు 31 | ఆశ్వి అప్డేట్స్:**

నల్లగొండ జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ పొందిన ఎన్. యాదయ్య, సబ్‌ఇన్‌స్పెక్టర్, ఎండీ. లియాఖత్ అలీ, ఏఆర్ఎస్ఐ, డి. వెంకటేశ్వర్లు రెడ్డి, బి. మోహన్‌రావు, హెడ్ కానిస్టేబుళ్లను ఎస్పీ శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సుమారు 36 సంవత్సరాల పాటు పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు వారు అందించిన సేవలు ఎంతో విలువైనవని అన్నారు. విధి నిర్వహణలో వారు చూపిన అంకితభావం, క్రమశిక్షణ, నిబద్ధత అభినందనీయమని పేర్కొన్నారు.

పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పనిచేసిన సిబ్బంది అనుభవాలు, సేవలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని ఎస్పీ తెలిపారు. పదవీ విరమణ అనంతరం వారు కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆరోగ్యంగా, ప్రశాంతమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. పోలీస్ శాఖకు వారు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని పదవీ విరమణ పొందిన అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఫెర్టిలిటీ సెంటర్లలో గీత దాటితే కఠిన చర్యలు.. మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలు

**తెలంగాణ బ్యూరో, ఆశ్వి అప్డేట్స్:**



రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలను దశలవారీగా జిల్లాలకు విస్తరించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రైవేట్ ఫెర్టిలిటీ సెంటర్లలో ఏఆర్‌టీ, సరోగసి, పీసీపీఎన్‌డీటీ చట్టాలను కఠినంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. గాంధీ, పేట్లబుర్జు ఆస్పత్రుల్లో గతేడాది ప్రారంభించిన ప్రభుత్వ ఐవీఎఫ్ సెంటర్ల ద్వారా ఇప్పటివరకు 39,802 మంది రోగులకు ఫెర్టిలిటీ సేవలు అందించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. వీటిలో 545 ఐవీఎఫ్, 521 ఐయూఐ ప్రక్రియలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సేవలను మరింత బలోపేతం చేస్తూనే, జిల్లాలకు సైతం విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 477 ఏఆర్‌టీ, సరోగసి సెంటర్ల కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని మంత్రి సూచించారు. ఇటీవల 379 ప్రైవేట్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించగా.. 50 చోట్ల లోపాలు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన 2 సెంటర్ల రిజిస్ట్రేషన్లను పూర్తిగా రద్దు చేయగా, మరో 9 సెంటర్ల అనుమతులను తాత్కాలికంగా రద్దు చేసినట్లు కమిషనర్ సంగీత సత్యనారాయణ తెలిపారు. రోగులపై అనవసర ఆర్థిక భారం మోపకుండా, పారదర్శకతతో సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడే కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు 2,600 స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు చేసి, లోపాలు ఉన్న 52 సెంటర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్, ఐవీఎఫ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.







## పోలీస్ సంక్షేమానికి నూతన కార్యవర్గం కృషి చేయాలి: ఎస్పీ డాక్టర్ వినీత్, IPS

**నారాయణపేట | ఆగస్టు 31 | ఆశ్వి అప్డేట్స్:**

జిల్లా పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించారు. ఈ నెల 25న ఎన్నికల ప్రక్రియలో భాగంగా సభ్యుల ఎంపిక జరగగా, సోమవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

13 మందితో కూడిన నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా హెడ్ కానిస్టేబుల్ సుధాకర్, వైస్ ప్రెసిడెంట్‌గా సీఐ శివశంకర్, రెండో వైస్ ప్రెసిడెంట్‌గా ఆర్ఎస్ఐ శివశంకర్, సెక్రటరీగా ఏ. వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీగా మురళీ కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, ట్రెజరీగా కానిస్టేబుల్ రాజు ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా హెడ్ కానిస్టేబుల్ శ్రీదేవి, కానిస్టేబుల్స్ యాదయ్య, పరంధాములు, శ్రీనివాసులు, రమేష్, మహేష్ ఎన్నికయ్యారు.

నూతన కార్యవర్గ సభ్యులకు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, IPS శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ అధికారుల సంఘం ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. నూతన కార్యవర్గం పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, సంక్షేమ అంశాలను సంఘం ప్రతినిధులు తన దృష్టికి నేరుగా తీసుకురావచ్చని ఎస్పీ తెలిపారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, బాధ్యత, నిబద్ధతతో పనిచేస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగించే లేదా చట్టవిరుద్ధమైన కార్యక్రమాలకు పాల్పడితే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని ఎస్పీ స్పష్టం చేశారు. సంఘం కార్యకలాపాలు పోలీస్ శాఖ నిబంధనలు, చట్టపరమైన పరిధిలోనే కొనసాగాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ మహేష్, సీఐలు రామ్‌లాల్, సైదులు, భగవంత్‌రెడ్డి, ఎస్‌బీ ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ

- **బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద ఆ పార్టీ ఫ్లెక్సీలు చించివేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు**
- **బీజేపీ రాష్ట్ర కార్యాలయ ముట్టడికి యూత్ కాంగ్రెస్ యత్నం**
- **కార్యాలయ గేటుకు నల్లరంగు పూసి నిరసన**
- **ప్రతిగా నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంపై బీజేపీ దాడి**
- **దానిని నిరసిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఇంటిపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి**
- **అడ్డుకోబోయిన వర్షిత్‌రెడ్డి తల్లిని తోసివేసిన కార్యకర్తలు**
- **బీజేపీ ఆఫీసుపై కూడా దాడికి కాంగ్రెస్ నేతల యత్నం**
- **అడ్డుకున్న పోలీసులు.. కానిస్టేబుల్‌కు గాయాలు**



**నల్లగొండ, ఆశ్వి అప్డేట్స్**

బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల దాడులు, నిరసనలతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ రాష్ట్ర కార్యాలయ గేటుకు కాంగ్రెస్ శ్రేణులు నల్లరంగు వేయగా, ప్రతిగా నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి కార్యాలయంపై బీజేపీ శ్రేణులు దాడికి దిగాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేపై, బిహార్‌లో విద్యార్థులపై బీజేపీ వ్యవహరించిన తీరును నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు.

బీజేపీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న గేటుకు నల్ల రంగు పూసి కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిష్టి□మ్మను దహనం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు యూత్ కాంగ్రెస్ శ్రేణులకు తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వెంటనే యూత్ కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్ట్ చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. గాం□దీభవన్ ముట్టడికి యత్నం.. బీజేపీ రాష్ట్ర కార్యాలయ గేటుకు యూత్ కాంగ్రెస్ శ్రేణులు నల్ల రంగు పూయడంపై బీజేవైఎం శ్రేణులు మండిపడ్డారు. దీనిని నిరసిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో గాం□దీభవన్ ముట్టడికి యత్నించారు. గాంధీభవన్‌పై కోడిగుడ్లు విసిరేసి నిరసన వ్యక్తం చేశారు. నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ శ్రేణులను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.

అట్టుడికిన నల్లగొండ బీజేపీ, కాంగ్రెస్ పరస్పర నిరసన దాడులతో నల్లగొండ జిల్లా కేంద్రం అట్టుడికింది. శ్రీనగర్ కాలనీలో ఉన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంపై (వ్యక్తిగత కార్యాలయం) సోమవారం బీజేపీ జిల్లా అ□ధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నేతృత్వంలో కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారు. అక్కడే ఉన్న మంత్రి ఫ్లెక్సీకి నిప్పంటించారు. దీంతో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో దేవరకొండ రోడ్డు చైతన్యపురికాలనీలో ఉన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నివాసంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడిచేశారు. ఇంట్లోని టీవీ, డైనింగ్ టేబుల్, ఫ్రిజ్, తదితర వస్తువులను పగులగొట్టారు. అడ్డుకోబోయిన వర్షిత్‌రెడ్డి తల్లిని కాంగ్రెస్ కార్యకర్తలు తోసేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడొకరు ఆమె తలను టీవీకేసి కొట్టారని, దీంతో ఆమెకు గాయాలయ్యాయని బీజేపీ నేతలు ఆరోపించారు. ఆమెను చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చినట్టు పేర్కొన్నారు. అనంతరం కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీగా బీజేపీ కార్యాలయం ముట్టడికి బయలుదేరారు. పోలీసులు కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకున్నాయి. ఈ క్రమంలోనే కొంతమంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీ కార్యాలయం వైపు వెళ్లి ఫ్లెక్సీలను ధ్వంసం చేసి రాళ్లు రువ్వారు. ఈ క్రమంలో ఓ కానిస్టేబుల్ తలకు గాయమైంది. మరోవైపు పార్టీ కార్యాలయం లోపలినుంచి బీజేపీ కార్యకర్తలు రాళ్లు రువ్వారు. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారడం, ఇరువర్గాలు ఎదురుపడితే పరిస్థితి చేయిదాటే ప్రమాదం ఉండటంతో పోలీసులు పూర్తి స్థాయిలో అడ్డుకున్నారు. వంద మంది వచ్చి నా ఇంటిపై దాడి చేశారని వర్షిత్‌రెడ్డి తల్లి శ్రీదేవి చెప్పారు. ప్రశ్నిస్తే దాడులేనా? - జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాంచందర్‌రావు, ఏలేటి అధికారం అడ్డం పెట్టుకొని ప్రతిపక్ష పార్టీ కార్యాలయాలపై దాడులకు దిగడం, ఇళ్లలోకి చొరబడి ఫర్నిచర్ ధ్వంసం చేయడం ఏమిటని కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండ సంజయ్ ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంపై, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేయడాన్ని ఇద్దరూ వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. బీజేపీ కార్యాలయాలు, నాయకుల నివాసాలపై కాంగ్రెస్ శ్రేణుల దాడుల యత్నం పిరికిపంద చర్య అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు మండిపడ్డారు. రాష్ట్రంలో నెలకొన్న అరాచకానికి, గూండా రాజ్యానికి బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై జరిగిన దాడి ప్రత్యక్ష నిదర్శనమని బీజేఎల్‌పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.



## ప్రమాదాల్లో మృతి చెందిన పోలీసు కుటుంబాలకు రూ.3 కోట్ల బీమా

- **ముగ్గురు కుటుంబాలకు రూ.కోటి చొప్పున చెక్కులు అందజేసిన డీజీపీ సీవీ ఆనంద్**

**హైదరాబాద్ | ఆగస్టు 31 | ఆశ్వి అప్డేట్స్:**




విధి నిర్వహణలో వివిధ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన ముగ్గురు పోలీసు సిబ్బంది కుటుంబాలకు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ అండగా నిలిచారు. ఒక్కో కుటుంబానికి రూ.కోటి చొప్పున మొత్తం రూ.3 కోట్ల బీమా పరిహారాన్ని సోమవారం డీజీపీ కార్యాలయంలో కుటుంబ సభ్యులకు చెక్కుల రూపంలో అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ మృతి: శంకర్‌పల్లి పరిధిలో 2025 ఫిబ్రవరి 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో 2018 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ ముత్తంగి శ్రీనివాస్ మృతి చెందారు. ఆయన తండ్రి ముత్తంగి యాదయ్యకు డీజీపీ రూ.కోటి బీమా చెక్కును అందించారు.

మరో ఇద్దరు పోలీసు సిబ్బంది కుటుంబాలకు కూడా: నల్లగొండ జిల్లా కనగల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించిన 2004 బ్యాచ్ హెడ్ కానిస్టేబుల్ బోలెపల్లి సైదులు 2025 జూన్ 3న రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అలాగే వరంగల్‌కు చెందిన కానిస్టేబుల్ కె. వెంకటరెడ్డి 2026 మార్చి 10న లారీ ఢీకొన్న ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు.

మృతులందరికీ ఎస్‌బీఐలో ఇన్సూరెన్స్ ఖాతాలు ఉండటంతో బ్యాంక్ అధికారులతో సమన్వయం చేసుకుని ఒక్కొక్క కుటుంబానికి రూ.కోటి చొప్పున బీమా పరిహారం అందజేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు డీజీపీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు పోలీసుశాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబాల సంక్షేమానికి శాఖ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీజీపీతో పాటు ఎస్‌బీఐ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# ఉరుమడ్లలో పలు కార్యక్రమాల్లో డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి

- ఆలయ నిర్మాణాలకు భూమిపూజ.. ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

**ఆశ్వి అప్డేట్స్ | చిట్యాల:**

నల్గొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ముత్యాలమ్మ, మారెమ్మ, పాపమ్మ ఆలయాల ధ్వజ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊర చెరువు వద్ద ముత్యాలమ్మ నూతన ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం ఉరుమడ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన అమిత్‌రెడ్డి.. 8, 9, 10వ తరగతుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత ఫలితాలు సాధించాలని సూచించారు. తల్లి దండ్రులు, ఉపాధ్యాయులతో పాటు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలను మరింతగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ సాగర్ల భానుశ్రీ భిక్షం, ఉపసర్పంచ్ ఉయ్యాల నరేష్, మాజీ ఎంపీటీసీ పోలగొని స్వామి, వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# దేవరకద్రలో అంతర్జాతీయ స్థాయి విద్యా వసతులు

- పేదలకు నాణ్యమైన విద్యే లక్ష్యం: ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి
- దమగ్నాపూర్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనుల పరిశీలన

**ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో | ఆగస్టు 31 | ఆశ్వి అప్డేట్స్:**

పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్‌లో 22 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పరిశీలించి, కాంక్రీట్ పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1 నుంచి 12వ తరగతి వరకు 2,720 మంది విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యా వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కౌకుంట్లలో మోడల్ స్కూల్ ఏర్పాటుకు 5 ఎకరాల భూమిని కేటాయించినట్లు వెల్లడించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఆధునిక ల్యాబ్‌లు, డిజిటల్ తరగతి గదులు, హాస్టల్ సదుపాయాలతో ప్రభుత్వ విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# నడ్డాను కలిసిన బీజేపీ జాతీయ పార్టీ విభాగాల సహ సమన్వయకర్త విష్ణువర్ధన్‌రెడ్డి

- పార్టీ సెల్‌స్‌ను బలోపేతం చేయాలి.. అన్ని వర్గాలను అనుసంధానం చేయాలి: జె.పీ. నడ్డా

**న్యూఢిల్లీ | ఆగస్టు 31 | ఆశ్వి అప్డేట్స్:**

బీజేపీ పూర్వ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పీ. నడ్డాను బీజేపీ జాతీయ పార్టీ విభాగాల సహ సమన్వయకర్త విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం ఢిల్లీలోని నడ్డా అధికార నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విష్ణువర్ధన్‌రెడ్డిని నడ్డా అభినందించి, రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా పార్టీ సెల్స్, ఇతర విభాగాలు చేపట్టాల్సిన కార్యక్రమాలపై పలు కీలక సూచనలు చేసినట్లు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. పార్టీ సెల్స్ ద్వారా సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన ప్రతిభావంతులను పార్టీతో అనుసంధానం చేయాలని నడ్డా సూచించినట్లు పేర్కొన్నారు. రాజకీయంగా ఆసక్తి కలిగి, ప్రజా జీవితంలో చురుకుగా ఉన్న ప్రముఖులను సెల్స్ ద్వారా పార్టీలోకి తీసుకురావడానికి కృషి చేయాలని సూచించారని తెలిపారు. అలాగే దేశవ్యాప్తంగా పార్టీ సెల్స్, ఇతర విభాగాలను మరింత బలోపేతం చేసి విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని నడ్డా సూచించినట్లు విష్ణువర్ధన్‌రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా తాను గతంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలోని పలు విషయాలను నడ్డా గుర్తు చేసుకున్నారని తెలిపారు. తనను అభినందించి, విలువైన సూచనలు, సహకారం అందించిన జె.పీ. నడ్డాకు విష్ణువర్ధన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. నడ్డా మార్గదర్శకత్వంతో పార్టీ జాతీయ స్థాయిలో అన్ని సెల్స్, విభాగాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.





# గిరిజన విద్యార్థినికి మర్రి జనార్దన్‌రెడ్డి రూ.50 వేల సాయం

- ఉన్నత విద్యకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదు: మాజీ ఎమ్మెల్యే

**ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో | ఆగస్టు 31 | ఆశ్వి అప్డేట్స్:**

పేదరికం ఏ విద్యార్థి భవిష్యత్తుకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మరోసారి ఉదారత చాటుకున్నారు. మండలంలోని పర్వతాయిపల్లి తండాకు చెందిన ముడావత్ సత్యం కుమార్తె అనూష హైదరాబాద్‌లోని శ్రీ హిందూ ఇంజనీరింగ్ కాలేజీలో ఉచిత సీటు పొందింది. అయితే హాస్టల్ ఫీజు చెల్లించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న మర్రి జనార్దన్‌రెడ్డి తన ఎంజేఆర్ ట్రస్ట్ ద్వారా ఆమెకు ఆర్థిక సహాయం అందించారు.

ఇప్పటికే మొదటి సంవత్సరం హాస్టల్ ఫీజు కోసం రూ.50 వేల సాయం అందించిన ఆయన.. వరుసగా రెండో సంవత్సరం కూడా రూ.50 వేల చెక్కును అనూషకు అందజేశారు. గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులు చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాపాలనలో 1000 రోజులు.. తెలంగాణ ప్రగతికి కొత్త దిశ

- తెలంగాణ అభివృద్ధి నమూనా దేశానికి దిక్సూచిగా నిలుస్తుంది: మంత్రి వాకిటి శ్రీహరి

**నారాయణపేట | ఆగస్టు 31 | ఆశ్వి అప్డేట్స్:**



కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు, తెలంగాణ ప్రజలకు మంత్రి వాకిటి శ్రీహరి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజాపాలనలో 1000 రోజుల్లో రైతు సంక్షేమం, పేదల భరోసా, యువతకు ఉద్యోగాలు, విద్య, సామాజిక న్యాయానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ, రైతు భరోసా పెంపు, గృహజ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్, 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి నిర్ణయాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయని పేర్కొన్నారు. బీసీ కులగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ ద్వారా సామాజిక న్యాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు.

1000 రోజులు ఒక మైలురాయి మాత్రమేనని, ప్రజల సంక్షేమం, తెలంగాణ అభివృద్ధి కోసం రాబోయే రోజుల్లో మరింత వేగంగా పనిచేస్తామని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. తెలంగాణ అభివృద్ధి నమూనా దేశానికి దిక్సూచిగా నిలిచేలా ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు.

# మంత్రి కోమటిరెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

**నల్లగొండ టౌన్ , ఆశ్వి అప్డేట్స్:**

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. శ్రీనగర్ కాలనీలోని క్యాంప్ కార్యాలయం సమీపంలో మంత్రి భారీ కటౌట్‌ను బీజేపీ నాయకులు దహనం చేసినట్లు కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మంత్రి క్యాంప్ కార్యాలయం పై కోడిగుడ్లు, టమాటాలతో దాడికి పాల్పడ్డారని వారు పేర్కొన్నారు. ఈ ఘటనలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డితో పాటు 25వ వార్డు కార్పొరేటర్ రాఖీ అనుచరులు, ఓ మహిళ ఉన్నట్లు కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించినట్లు సమాచారం. ఘటనకు దారితీసిన కారణాలు, బాధ్యులపై చర్యల వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.





# జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి

- ప్రజా సమస్యలపై వేగంగా స్పందించి న్యాయం జరిగేలా చర్యలు: అదనపు ఎస్పీ రాజేష్ మీనా, IPS

**వికారాబాద్ | ఆగస్టు 31 | ఆశ్వి అప్డేట్స్:**

వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, IPS పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలు, ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా వివరించగా, అదనపు ఎస్పీ వాటిని సానుకూలంగా విని, సంబంధిత అధికారులు, పోలీస్ సిబ్బందికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ శాఖను ఆశ్రయించే ప్రజల సమస్యలపై చట్టబద్ధంగా, పారదర్శకంగా, వేగంగా స్పందించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంలో, వారి సమస్యలను పరిష్కరించడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.

# కేంద్రం, రాష్ట్రాల సమన్వయంతో సుస్థిర జలభద్రత : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**తెలంగాణ బ్యూరో, ఆశ్వి అప్డేట్స్:**

కేంద్రం, రాష్ట్రాల సమన్వయంతో సుస్థిర జల భద్రతకు ఉమ్మడి కార్యాచరణ తీసుకున్నట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోవారం సెక్రెటేరియట్‌లో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సుస్థిర జలవనరుల నిర్వహణకు సమన్వయంతో కూడిన కార్యాచరణ రూపొందించే లక్ష్యంతో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేడు, రేపు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించనున్న జాతీయ సదస్సులో తెలంగాణ తన సమగ్ర జలభద్రత నమూనాను దేశం ముందుంచనుందని వెల్లడించారు. జాతీయ సదస్సులో తెలంగాణ తరపున సమర్పించనున్న ప్రజెంటేషన్‌లో పొందుపరచాల్సిన అంశాలు, రాష్ట్రంలో అమలవుతున్న జలసంరక్షణ కార్యక్రమాలు, గొలుసుకట్టు చెరువుల పరిరక్షణ, జలవనరుల జియోట్యాగింగ్, భూగర్భజలాల పర్యవేక్షణతోపాటు దేశవ్యాప్తంగా అనుసరించదగిన సమగ్ర జలభద్రత విధానంపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. దేశ జలభద్రతకు సంబంధించిన కీలక సవాళ్లపై కేంద్రం, రాష్ట్రాలు ఒకే వేదికపై చర్చించి భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేయనున్న నేపథ్యంలో ఈ సదస్సుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని మంత్రి పేర్కొన్నారు. జలవనరుల సంరక్షణ నుంచి ప్రజలకు సురక్షితమైన తాగునీటి సరఫరా వరకు వివిధ అంశాల్లోన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మరింత సమన్వయం సాధిస్తూ, నిర్దిష్ట కాలపరిమితితో కూడిన జాతీయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని తెలిపారు.








# నారాయణపేటలో సిరి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం.. ముఖ్య అతిథిగా ఎంపీ డీకే అరుణ

**నారాయణపేట | ఆగస్టు 31 | ఆశ్వి అప్డేట్స్:**


నారాయణపేట జిల్లా కేంద్రంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ్ పాండు రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిరి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమానికి ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి, డీకే అరుణ మాట్లాడుతూ నారాయణపేటలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా పేద, సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ఆసుపత్రి యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వైద్య సేవల ఫీజుల విషయంలో పేదలకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు.

కార్యక్రమంలో కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్, మున్సిపల్ చైర్మన్ శ్వేత సత్య యాదవ్, వైస్ చైర్మన్ మంజుల జీఆర్ రెడ్డి, పవన్‌కుమార్ రెడ్డి, భరత్ ప్రసాద్, గువ్వల బాలరాజు, జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, సీనియర్ నాయకులు నాగురావు నామాజీ, పగడాకుల శ్రీనివాస్, కొండయ్య, రఘురామయ్య, జీఆర్ రెడ్డి, బలరాంరెడ్డి, తిరుపతిరెడ్డి, లక్ష్మీ శ్యామ్‌సుందర్, బొక్క బాల్‌రెడ్డి, కార్పొరేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉమేష్, మహబూబ్ అలీ, శ్రీవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బొజ్జ గణపయ్యకు ఈ స్వీట్స్ ఎంతో ఇష్టం..!

త్వరలో వినాయకచవితి రాబోతున్నది. అయితే వినాయకచవిత రోజు మనం ఇండ్లల్లో చేసుకొనే స్వీట్స్ కు కూడా ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. బొజ్జ గణపయ్యకు ఇష్టమైన స్వీట్స్ ఏమిటో అవి ఎలా తయారు చేసుకోవాలో ఈ కథనంలో తెలుసుకుందాం.. సెప్టెంబర్ 7న అంటే శనివారం వినాయకుడిని ప్రతిష్టంచబోతున్నారు. ఈ రోజు కోసం దేశ వ్యాప్తంగా ప్రజలంతా ఎంతో ఆసక్తిగా, ఆనందంగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ తరుణంలో బొజ్జ గణపయ్యకు ఇష్టమైన రకరకాల వంటకాలను తయారచేసి నైవేద్యంగా పెడుతుంటారు.





## 1. రైస్ బర్ఫీ

కావాల్సిన పదార్థాలు :
బియ్యం : 1 కప్పు
నెయ్యి : 1 టీ స్పూన్
బాదం, జీడిపప్పులు : 5 చొప్పున
చక్కెర : 1/4 కప్పు
పాలు : 2 కప్పులు
నీళ్లు : 1 టీ స్పూన్

**తయారీ విధానం :**

ఒక పాన్ తీసుకుని అది బాగా వేడి అయ్యాక అందులో నెయ్యి వేసి బియ్యాన్ని వేయించాలి. అది రంగు మారే వరకు వేగించి అనంతరం చల్లార్చి అందులో బాదం, జీడిపప్పులు వేసి మిక్సీ పట్టాలి. ఆ తర్వాత మరొక పాన్ తీసుకుని అందులో నీళ్లు పోసి, చక్కెరను బాగా కరిగించాలి. అలా చక్కెర పాకం వచ్చే వరకు ఉంచి అనంతరం బియ్యంపిండిని కలిపి బాగా కలపాలి. ఇలా చేసిన తర్వాత అందులో కొంచెం నెయ్యి వేసి మరికొంత సేపు కలపాలి. అనంతరం అది ఒక నెయ్యి రాసిన గిన్నెలో తీసుకుని సమానంగా నేర్పి చల్లారనివ్వాలి. చల్లారిన తర్వాత దానిని కట్ చేస్తే స్వీట్ తయారవుతుంది.



## 2. షిర్వాలే

కావాల్సిన పదార్థాలు :
బియ్యప్పిండి : 1 కప్పు
కొబ్బరి పాలు : 1 కప్పు
బెల్లం : 1/2 కప్పు
జీలకర్ర పొడి : 1 టీ స్పూన్
కుంకుమ పువ్వు
యాలకుల పొడి : 1/4 టీ స్పూన్
అరిటాకులు
నీళ్లు : 1 1/2 కప్పు
ఉప్పు : సరిపడా
నెయ్యి : 1 టీ స్పూన్

**తయారీ విధానం :**

ఒక గిన్నెలో కొబ్బరి పాలు తీసుకుని అందులో బెల్లం, కుంకుమ పువ్వు, యాలకుల పొడి, జీలకర్రపొడి, కాసింత ఉప్పు వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి. మరో పాన్ తీసుకుని దానిలో నీళ్లు మరగబెట్టాలి. అందులో నెయ్యి, చిటికెడు ఉప్పు, బియ్యం పిండిని వేసి బాగా కలపాలి. ఇలా రెండు నిమిషాల పాటు వదిలేసి ఉడికిన తర్వాత పక్కన పెట్టుకోవాలి. అనంతరం దానిని ముద్దగా కలుపుకోవాలి. అందులో కొంచెం పిండి కూడా కలుపుకుంటూ దానిని నూనె పూసి చక్రాలుగా తయారుచేసుకోవాలి. ఇలా చేసిన తర్వాత ఇడ్లీ పాత్ర తీసుకుని అందులో ఆవిరి పెట్టి బాగా ఉడికించుకోవాలి. ఇడ్లీ ప్లేట్లో నూనె పూసిన అరిటాకును వేసి దానిపై బియ్యంపిండితో తయారుచేసిన మిశ్రమాన్ని పెట్టి కొన్ని నిమిషాల పాటు ఉడకనివ్వాలి. అనంతరం దానిని ఒక ప్లేట్లోకి తీసుకుని బెల్లం మిశ్రమాన్ని పోసి కాసేపు పక్కన పెట్టుకుంటే షిర్వాలే







# బరువు తగ్గించే మ్యాజిక్ డ్రింక్

ప్రస్తుతం ఉబకాయుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. శారీరకశ్రమ లేకపోవడం.. జీవనశైలి, ఆహారపు అలవాట్లు తదితర కారణాలతో విపరీతంగా బరువు పెరుగుతున్నారు. కూర్చొని చేసే ఉద్యోగాలు కావడం కూడా బరువు పెరగడానికి ఓ కారణం. అయితే ఇక బరువు తగ్గించుకొనేందుకు కూడా అనేక మార్గాలను అన్వేషిస్తున్నారు. కొందరు ఆహారపు అలవాట్లను మార్చుకుంటున్నారు. మరికొందరేమో యోగా, జీమ్ వంటి వాటని ఆశ్రయిస్తున్నారు. అయితే వీటితో పాటు కొన్ని రకాల డ్రింక్స్ కూడా శరీర బరువును తగ్గిస్తాయని ఆరోగ్య నిపుణలు చెబుతున్నారు. అందరి వంటింట్లో ఉంటే దాల్చిన చెక్కతో తయారు చేసిన డ్రింక్ తాగితే ఈజీగా బరువు తగ్గొచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ప్రతి రోజు దాల్చిన చెక్క నిమ్మరసం, మెంతులతో చేసిన డ్రింక్ తాగితే ఈజీగా బరువు తగ్గొచ్చట. ఈ డ్రింక్ వల్ల ఎన్నో రకాల హెల్త్ బెనిఫిట్స్ ఉంటాయి. నిమ్మకాయ నిమ్మకాయలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. నిమ్మకాయను ఆహారంలో చేర్చుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇది బరువును తగ్గించుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుంది. దాల్చిన చెక్కలో థర్మోజెనిక్ లక్షణాలు దాల్చిన చెక్కలో పుష్కలంగా ఉంటాయి. ఇది జీవక్రియను మెరుగుపరచడంలో ఎంతగానో ఉపయోగపడుతుంది. అంతే కాకుండా బరువును తగ్గించడానికి దోహదం చేస్తుంది. మెంతులు హెపాటో ప్రొటెక్టివ్ ప్రభావాలు వీటిలో ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఫైబర్ కూడా అధికంగా ఉంటుంది. మెంతులు తినడం వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. దీంతో బరువు తగ్గేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. లివర్ ను డిటాక్సిపై చేయడంలో కూడా ఇది సహాయపడుతుంది.

**ఈ డ్రింక్ తయారీ విధానం:**

**కావాల్సిన పదార్థాలు**
దాల్చిన చెక్క పొడి 1 టీ స్పూన్
నిమ్మకాయ 1
మెంతులు – 1 టీస్పూన్
నీరు – 1 కప్పు

ఒక బౌల్ తీసుకుని అందులో ఒక కప్పు నీరు వేసి వేడి చేయాలి. నీళ్లు మరుగుతున్న సమయంలో నిమ్మకాయను కట్ చేసి అందులో అందులో పిండుకోవాలి. అలాగే అందులోకి 1 టీ స్పూన్ దాల్చిన చెక్క పొడిని యాడ్ చేసుకోవాలి. తర్వాత పౌడర్ చేసుకున్న మెంతుల పొడిని వాటర్‌లో వేసుకోవాలి. ఇది మరిగిన తర్వాత డ్రింక్ పూర్తవుతుంది. ప్రతి రోజు పరగడుపున ఈ డ్రింక్ తాగితే ఎంతో ప్రయోజనమని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.






# బెడ్ రూమ్ ను అందంగా అలంకరించుకొనే చిట్కాలివే..!

మన ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడంతో పాటూ అందంగా అలంకరించుకోవాలి కూడా.. అప్పుడే మనసు ప్రశాంతంగా ఉంటుంది. మన ఇంటికి వచ్చిన అతిథులు ఆహ్లాదంగా ఫీల్ అవుతారు. అయితే బెడ్ రూమ్ కి రాయల్ లుక్ ఎలా ఇవ్వాలో ఈ కథనంలో తెలుసుకుందాం.. చిన్న చిన్న టిప్స్ పాటించడం ద్వారా బెడ్ రూమ్ ఎంతో అందంగా అలంకరించుకోవచ్చు. బెడ్ రూమ్ ఎంత ప్రశాంతంగా, ఎంత అందంగా ఉంటే అంత మంచి నిద్ర, మనసు ప్రశాతంగా ఉంటుంది. అంతేకాకుండా బెడ్‌షీట్ బెడ్‌రూమ్‌కి మంచి లుక్‌ని ఇస్తుంది. బెడ్‌షీట్ అందంగా వేస్తే బెడ్‌రమ్ లుక్ కూడా మంచిగా కనిపిస్తుంది. అయితే బెడ్‌రూమమ్‌లో బెడ్‌షీట్‌ని స్టైలిష్‌గా ఏ విధంగా మార్చాలో కొన్ని విషయాలు ఈ ఆర్టికల్‌లో తెలుసుకుందాం.

**స్టైలిష్ బెడ్‌షీట్**

పడకగదికి కొత్త, రాయల్ లుక్ ఇవ్వాలనుకుంటే రెడ్ ఫ్లవర్ ప్రింట్‌తో కూడిన ఈ బెడ్‌షీట్ పడకగదికి కొత్త రూపాన్ని ఇస్తుంది. ఇది పడకగది అందాన్ని పెంచుతుంది. ఈ తెలుపు రంగు డిజైనర్ బెడ్‌షీట్ పడకగదికి చాలా ప్రొఫెషనల్ లుక్‌ని ఇస్తుంది. ఈ బెడ్‌షీట్‌ని చూసి మీ భర్త కూడా మెచ్చుంటారు. పసుపు, పింక్ కలర్ ప్రింటెడ్ డిజైనర్ బెడ్‌షీట్ పడకగదిని అందంగా మార్చుతుంది. దీంతో ఈ దిండు కవర్లు కూడా అద్భుతంగా కనిపిస్తాయి. మెత్తగా ముద్రించిన తెల్లటి బెడ్‌షీట్‌ను గదిలోని బెడ్‌పై కూడా ఉంచవచ్చు. ఇది మీ గదిని చాలా అందంగా చేస్తుంది.





PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S